# మనం





## నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 17 | అక్టోబర్ | 2026 పేజీలు: 8


# బ్లడ్ బ్యాంక్‌కు స్థలం కేటాయిస్తాం: కలెక్టర్




**- కామారెడ్డి రెడ్క్రాస్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ హామీ.**

**- రెడ్క్రాస్ సభ్యత్వంలో రాష్ట్రంలోనే రెండో స్థానంలో కామారెడ్డి.**

2

కామారెడ్డి, అక్టోబరు 16(మనం న్యూస్): జిల్లాలో ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని కలెక్టర్, జిల్లా రెడ్క్రాస్ అధ్యక్షుడు ఆశిష్ సాంగ్వాన్ హామీ ఇచ్చారు. నూతన కమిటీ సభ్యులు ఈ దిశగా కృషి చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో శుక్రవారం రెడ్క్రాస్ జిల్లా మేనేజ్మెంట్ కమిటీ నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై సభ్యులతో ప్రమాణం చేయించారు. అదనపు కలెక్టర్లు విక్టర్, గిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., కామారెడ్డి రెడ్క్రాస్ బ్రాంచ్ అనేక సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని ప్రశంసించారు. సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు.

## ఆరుతడి పంటలే
# శ్రీరామరక్ష!

ఎల్నినో హెచ్చరికలు బేఖాతరు.. వరి సాగువైపే రైతుల మొగ్గు

ఒకవైపు కోతలు.. మరోవైపు నారుమళ్లు, దుక్కులు! నీరు, విద్యుత్వే ముందుచూపు అవసరం

వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాల్సిన అవసరం

మనం న్యూస్ ప్రత్యేక కథనం

2



## పూల మార్కెట్లో
# బతుకమ్మ సందడి!



గునుగు పూల నుంచి బంతిపూల వరకు.. పల్లె పట్టణాల్లో పండుగ కళ

ఆదివారం సద్దుల బతుకమ్మకు సిద్ధమవుతున్న మహిళలు.. కట్టకు రూ.10 నుంచి రూ.15కు గునుగు పూల విక్రయం

5





# బ్లడ్ బ్యాంక్కు స్థలం కేటాయిస్తాం: కలెక్టర్

**- కామారెడ్డి రెడ్క్రాస్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ హామీ.**

**- రెడ్క్రాస్ సభ్యత్వంలో రాష్ట్రంలోనే రెండో స్థానంలో కామారెడ్డి.**







కామారెడ్డి, అక్టోబరు 16(మనం న్యూస్): జిల్లాలో ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని కలెక్టర్, జిల్లా రెడ్క్రాస్ అధ్యక్షుడు ఆశిష్ సాంగ్వాన్ హామీ ఇచ్చారు. నూతన కమిటీ సభ్యులు ఈ దిశగా కృషి చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో శుక్రవారం రెడ్క్రాస్ జిల్లా మేనేజ్మెంట్ కమిటీ నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై సభ్యులతో ప్రమాణం చేయించారు. అదనపు కలెక్టర్లు విక్టర్, గిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., కామారెడ్డి రెడ్క్రాస్ బ్రాంచ్ అనేక సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని ప్రశంసించారు. సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు.

## బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుతో మెరుగైన సేవలు

బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుతో రక్తం అవసరమైన వారికి మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజారోగ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నషా ముక్త్ భారత్, టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాల్లో రెడ్క్రాస్ సభ్యులు చురుగ్గా పాల్గొనాలని కోరారు.

## నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

జిల్లా చైర్మన్గా డాక్టర్ ఎం. సంజీవరెడ్డి, స్టేట్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడిగా డాక్టర్ ఎం. జైపాల్రెడ్డి, వైస్ చైర్మన్గా దస్తిరామ్, కోశాధికారిగా రమేష్రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ చైర్మన్ రాజన్నతో పాటు జిల్లా మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు నాగరాజుగౌడ్, కృష్ణ, గోవర్ధన్, సదాశివరెడ్డి, శ్రీధర్ జోషి, శ్రీకాంత్, దత్తాత్రి, కిరణ్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కార్మికశాఖ అధికారి శశికుమార్, ఎన్నికల అధికారి ప్రశాంత్రెడ్డి, డీఈఓ మల్లికార్జున్, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకట్, ఇతర అధికారులు, రెడ్క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

---

# ఆరుతడి పంటలే శ్రీరామరక్ష!

**ఎన్నినో హెచ్చరికలు బేఖాతరు.. వరి సాగువైపే రైతుల మొగ్గు**

**ఒకవైపు కోతలు.. మరోవైపు నారుమళ్లు, దుక్కులు! నీరు, విద్యుత్పై ముందుచూపు అవసరం**

**వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాల్సిన అవసరం**

**మనం న్యూస్ ప్రత్యేక కథనం**





నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 16 (మనం న్యూస్): ఒకవైపు చేతికొచ్చిన వరి పంటను కోస్తున్న రైతులు.. మరోవైపు వచ్చే పంట కోసం మళ్లీ వరి నారుమళ్లు పోస్తూ, దుక్కులు దున్నుతూ సాగుకు సిద్ధమవుతున్నారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత, విద్యుత్ సరఫరాపై అనిశ్చితి నెలకొంటున్న నేపథ్యంలో ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ అధికారులు చేస్తున్న సూచనలు మాత్రం క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో అమలవుతున్నట్లు కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రస్తుత అవసరాలతోపాటు రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లను కూడా దృష్టిలో పెట్టుకుని సాగు నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## హెచ్చరికలు చేస్తున్నా.. వరి సాగుకే ప్రాధాన్యం!

నిజామాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి సహా వ్యవసాయ శాఖ అధికారులు ఆరుతడి పంటల సాగును ప్రోత్సహిస్తున్నారు. మొక్కజొన్న, జొన్న, శనగ, పెసర, పొద్దుతిరుగుడు, వేరుశనగ, నువ్వులు వంటి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు. ఎల్నినో ప్రభావం కారణంగా వర్షపాతంలో మార్పులు, నీటి లభ్యతలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు ముందస్తు సమాచారం అందిస్తున్నారు.

అయినప్పటికీ కొందరు రైతులు వరి సాగుకే ప్రాధాన్యమిస్తున్నారు. పదెకరాల్లో వరి సాగు చేసే రైతులు సైతం కనీసం ఐదెకరాలైనా వరి వేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. గత అనుభవాలు, వరిపై ఉన్న నమ్మకం, మార్కెట్ అంచనాలు రైతులను ఈ దిశగా నడిపిస్తున్నప్పటికీ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళికలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

## 25 శాతం కోతలు పూర్తి.. మిగతా పంట పొలాల్లోనే!

నిజామాబాద్ రూరల్ ప్రాంతంలో ఇప్పటివరకు సుమారు 25 శాతం వరి కోతలు పూర్తయినట్లు అంచనా వేస్తుండగా, మిగిలిన 75 శాతం పంట కోతకు రావాల్సి ఉంది లేదా ఇంకా పచ్చగా పొలాల్లోనే ఉంది. ఒకవైపు ప్రస్తుత పంటను ఇంటికి చేర్చుకునే పనుల్లో రైతులు నిమగ్నమవుతుండగా, మరోవైపు తదుపరి పంటకు సంబంధించి నారుమళ్లు పోయడం, దుక్కులు దున్నడం వంటి పనులు కొనసాగుతున్నాయి.

ఈ సమయంలో సాగు విస్తీర్ణం, అందుబాటులో ఉన్న నీరు, భూగర్భ జలాల పరిస్థితి, విద్యుత్ సరఫరా, పంట కోతల సమయం వంటి అంశాలను బేరీజు వేసుకుని తదుపరి పంటను ఎంపిక చేసుకోవడం కీలకం. తొందరపాటుతో నిర్ణయాలు తీసుకుంటే పెట్టుబడులు పెరిగి, చివరకు రైతులకు ఆర్థిక భారం కలిగే ప్రమాదం ఉంది.

## బోరుబావుల్లో నీరున్నా.. విద్యుత్పై భరోసా ఏది?

ప్రస్తుతం బోరుబావుల్లో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, పంట కాలమంతా అదే స్థాయిలో నీరు ఉంటుందనే హామీ లేదు. భూగర్భ జలాలు తగ్గడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడడం వంటి సమస్యలు ఎదురైతే అధిక నీరు అవసరమయ్యే వరి పంటను కాపాడుకోవడం రైతులకు సవాలుగా మారవచ్చు. అందుకే ప్రస్తుత నీటి లభ్యతను మాత్రమే చూసి సాగు నిర్ణయం తీసుకోకుండా, పంట చివరి దశ వరకు అవసరమయ్యే నీటిని అంచనా వేయాలని అధికారులు సూచిస్తున్నారు.

ఆరుతడి పంటల సాగు ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతోపాటు పంటల వైవిధ్యాన్ని పెంచుకునే అవకాశం ఉంటుంది. అయితే ఏ ప్రాంతంలో ఏ పంట అనుకూలంగా ఉంటుంది, విత్తనాలు ఎప్పుడు వేయాలి, మార్కెట్ పరిస్థితులు ఎలా ఉన్నాయి అనే అంశాలపై స్థానిక వ్యవసాయ అధికారుల సలహా తీసుకోవడం అవసరం.

## రైతు నష్టపోకూడదు.. ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలి!

రైతులు వరి సాగును పూర్తిగా విరమించుకోవాలనే ఉద్దేశం కాదు.. పరిస్థితులకు తగినట్లుగా పంటల ఎంపికలో సమతుల్యత పాటించాలన్నదే ప్రధాన ఉద్దేశం. వరి సాగుకు అనుకూలమైన భూములు, విశ్వసనీయమైన నీటి వనరులు ఉన్నచోట వాటిని పరిగణనలోకి తీసుకుంటూనే, నీటి కొరతకు గురయ్యే అవకాశమున్న భూముల్లో ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలి. దీనివల్ల రైతుల పెట్టుబడులపై ఒత్తిడి తగ్గడంతోపాటు నీటి వనరుల సమర్థ వినియోగానికి అవకాశం ఉంటుంది.

ఇందుకోసం వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలవారీగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పంటలవారీగా సాగు ఖర్చులు, నీటి అవసరాలు, దిగుబడి అవకాశాలు వివరించడం, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, మార్కెటింగ్ సదుపాయాలపై స్పష్టత ఇవ్వడం అవసరం. ప్రజాప్రతినిధులు, రైతు సంఘాలు, గ్రామస్థాయి వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే రైతులకు సరైన సమయంలో సరైన సమాచారం అందించవచ్చు.

## ముందుచూపే రైతుకు పెట్టుబడి.. అవగాహనే వ్యవసాయానికి బలం!

వాతావరణ పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. నిన్నటి అనుభవమే రేపటి సాగుకు పూర్తి భరోసా ఇవ్వలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందువల్ల రైతులు భావోద్వేగాలతో కాకుండా భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ అంచనాలు, మార్కెట్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని సాగు ప్రణాళిక రూపొందించుకోవాలి.

ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అందిస్తున్న సూచనలను రైతులు పరిశీలించి, తమ పొలాలకు అనుగుణమైన నిర్ణయాలు తీసుకోవాలి. అదే సమయంలో రైతుల సందేహాలను నివృత్తి చేసి, ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన సహకారం అందించడం అధికారుల బాధ్యత. రైతు బాగుంటేనే వ్యవసాయం బాగుంటుంది.. వ్యవసాయం బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. ముందస్తు ప్రణాళిక, సమన్వయం, శాస్త్రీయ సాగు పద్ధతులే రైతును నష్టాల నుంచి కాపాడే మార్గాలు.

# రబీ సీజన్లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

## రైతులకు సూచించిన ఆర్మూర్ మండల వ్యవసాయ శాఖ



ఆర్మూర్, అక్టోబర్ 16(మనం న్యూస్): ఆర్మూర్: రాబోయే రబీ సీజన్లో ఎల్నినో ప్రభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భూగర్భ జలాల తగ్గుదల, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఆర్మూర్ మండల వ్యవసాయ శాఖ సూచించింది. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకొని ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని కోరింది.ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో బోర్లలో భూగర్భ జలాలు వేగంగా తగ్గుతున్నాయని, రానున్న రోజుల్లో సాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ పేర్కొంది. ఈ పరిస్థితుల్లో వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలన్న ప్రభుత్వ సూచనలను రైతులు పరిగణనలోకి తీసుకోవాలని తెలిపింది.రబీ సీజన్లో వరికి బదులుగా తెల్ల జొన్నలు, ఎర్ర జొన్నలు, నువ్వులు, పొద్దుతిరుగుడు, కుసుమ, మొక్కజొన్న, పెసర, మినుములు వంటి పంటలను సాగు చేయాలని సూచించింది. ముఖ్యంగా ఎర్ర జొన్నలు సాగు చేసే రైతులు ముందుగానే కొనుగోలు ఒప్పందం చేసుకోవడం మంచిదని పేర్కొంది.

రైతులు పంటల ఎంపికలో నీటి లభ్యతతో పాటు మార్కెట్లో డిమాండ్, కొనుగోలు సదుపాయాలు, కనీస మద్దతు ధర (ఎంఎస్పీ), ప్రభుత్వ కొనుగోలు విధానాలను పరిశీలించాలని వ్యవసాయ శాఖ సూచించింది. పంట నష్టాలను నివారించేందుకు నీరు, విద్యుత్ లభ్యతను అంచనా వేసుకొని సాగు చేపట్టాలని కోరింది.నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఆర్మూర్ మండల వ్యవసాయ శాఖ రైతులకు విజ్ఞప్తి చేసింది.



# పశువులకు ఉచిత వైద్య శిబిరం

సదాశివనగర్, అక్టోబర్ 16(మనం న్యూస్): పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశువైద్య అధికారి డాక్టర్ శివ సూచించారు.సదాశివనగర్ మండలం జనగామ గ్రామంలో శుక్రవారం సర్పంచ్ ధార్వాయి మదుబాయిశ్రీకాంత్ రావు ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...పశువుల పెంపకంలో పరిశుభ్రత పాటిస్తూ వాటికి సమతుల్యమైన ఆహారం అందించాలని సూచించారు.పశువుల్లో గర్భకోశ సంబంధిత సమస్యలను నివారించేందుకు అవసరమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని అన్నారు.నట్టల నివారణకు పశువైద్యుల సూచనల మేరకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.పశుసంవర్ధక శాఖ అందించే వైద్య సేవలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పశుగణంక అధికారి అహల్య,గోపాలమిత్ర సూపర్వైజర్ కృష్ణ,గోపాలమిత్రాలు మురళి,రాజేశ్వర్,కాశిరెడ్డి,రైతలు పాల్గొన్నారు.



## ఈ నెల 18 న అర్ధ నారేశ్వరి

# మెర్కోభ పిరమిడ్ ప్రారంభోత్సవం

బోధన్ అక్టోబర్ 16 (మనం న్యూస్): నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం కొత్త పల్లి గ్రామంలో ఈ నెల పద్దెనిమిది తేదీన మెర్కోబ ధ్యాన పిరమిడ్ ప్రారంభోత్సవం జరగనున్నది అని పత్రిజీ జన్మస్థల్ ట్రస్టు అధ్యక్షులు నల్లా గంగా రెడ్డి కోశాధికారి డాక్టర్ నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు జగద్గురు బ్రహ్మర్షి సుభాష్ పత్రిజీ మార్గదర్శకంలో నిజామాబాద్ జిల్లా పిరమిడ్ స్పిచువల్ సొసైటీ మూవ్మెంట్ ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు పిరమిడ్ ధ్యాన కేంద్రం పల్ల గుట్ట మహారాజ్ శ్రీ శ్రీ శ్రీ కేదారానంద స్వాములు చేతుల మీదగా ప్రారంభం జరుగుతుందని ఈ కార్యక్రమం కు జ్ఞాన దాతలుగా శ్రీమతి అరుణ రాజారెడ్డి లు గా తమ సందేశాన్ని అందించనున్నారు పిరమిడ్ ప్రారంభోత్సవ ఆనంతరం మెగా అహింస కరుణ మహా శాకాహార ర్యాలీ ఉంటుందని ర్యాలీ తరువాత సాత్విక ఆహారం అందజేయడం జరుగుతుందని నిజామాబాద్ జిల్లా పరిసర ప్రాంతాల నుండి ధ్యానులు పిరమిడ్ మాస్టర్లు అధిక సంఖ్యలో వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలని అధ్యక్షులు నల్లా గంగారెడ్డి కోరారు



# జంగలోడి తండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శ్రీకారం

## లబ్ధిదారు మలావత్ రంజితకు ప్రొసీడింగ్ కాపీ అందించిన సర్పంచ్



నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 16 (మనం న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. సిరికొండ మండలంలోని జంగలోడి తండా గ్రామ పంచాయతీ పరిధిలో మలావత్ రంజిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో శుక్రవారం ఇంటి నిర్మాణ పనులకు సర్పంచ్ బుక్య గంగాధర్ నాయక్ శ్రీకారం చుట్టారు.

రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ స్వయంగా లబ్ధిదారు మలావత్ రంజితకు ఇందిరమ్మ ఇంటి మంజూరు ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేశారు. అనంతరం ఇంటి నిర్మాణం ప్రారంభానికి ముగ్గు వేసి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా గ్రామ పంచాయతీ తరఫున కృషి చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరడం సంతోషకరమని పేర్కొంటూ, మలావత్ రంజిత కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి గొల్ల ఎర్రన్న, ఉపసర్పంచ్ మలావత్ కౌసల్య, పంచాయతీ కార్యదర్శి కిషన్, తండా పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# దసరా ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన సర్పంచ్ రేఖ సుదర్శన్

## వార్డు సభ్యులతో కలిసి ఏర్పాట్ల పరిశీలన

భిక్కనూరు, అక్టోబర్ 16 ( మనం న్యూస్ ) : భిక్కనూరు పట్టణంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని చేపడుతున్న ఏర్పాట్లను గ్రామ సర్పంచ్ బాల్యాల రేఖ సుదర్శన్ వార్డు సభ్యులతో కలిసి పరిశీలించారు. పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించివాటిపై సభ్యులతో చర్చించారు. దసరా ఉత్సవాల్లో గ్రామ ప్రజలందరూ ఉత్సాహంగా పాల్గొనేలా ఏర్పాట్లు ఉండాలని వేడుకలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అందరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

పండుగ వేడుకలు గ్రామ ప్రజల మధ్య ఐక్యతకు, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. ఉత్సవాల నిర్వహణలో ప్రతి ఒక్కరి సహకారం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సురేష్ గౌడ్, వేణు, రాజు, పంచాక్షరి, చంద్రం, రాంచంద్రం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ నగర్లో గ్రామ పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాల పంపిణీ

**పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి కొత్త బట్టలు అందజేసిన సర్పంచ్ వాగ్మారె మాధవ్...**

రెంజల్, 16 అక్టోబర్ (మనం న్యూస్): గ్రామ అభివృద్ధిలోనూ, పరిశుభ్రత పరిరక్షణలోనూ కీలక పాత్ర పోషిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రోత్సహిస్తూ అంబేద్కర్ నగర్ గ్రామ సర్పంచ్ వాగ్మారె మాధవ్ నూతన వస్త్రాలను అందజేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, ముఖ్యంగా పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ గ్రామంలో పరిశుభ్రతను కాపాడేందుకు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బందికి నూతన బట్టలను అందజేసి వారిని అభినందించారు.



**గ్రామ పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం.,**

గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో ముఖ్యమైనవి. ప్రతిరోజూ తమ విధులను బాధ్యతగా నిర్వర్తిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు వారు చేస్తున్న కృషి అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, గ్రామ పరిసరాల పరిశుభ్రత కోసం పనిచేసే సిబ్బందిని ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఉత్సాహాన్ని నింపవచ్చని తెలిపారు.

**సిబ్బంది సేవలకు గుర్తింపుగా నూతన వస్త్రాలు.,**

గ్రామ పంచాయతీ సిబ్బంది కష్టాన్ని, వారి సేవలను గుర్తిస్తూ నూతన వస్త్రాలను అందజేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజాప్రతినిధులతో పాటు పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయడం అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడటంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాగ్మారె మాధవ్తో పాటు ఉపసర్పంచ్ వందనబాయ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు...

# మంచిప్పలో కారుకు నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తి!

**సీసీటీవీ ఫుటేజీలో ఘటన దృశ్యాలు.. రూ.లక్ష నష్టం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న మోపాల్ పోలీసులు**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 16 (మనం న్యూస్): నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం మంచిప్ప గ్రామంలో ఇంటి ముందు పార్క్ చేసిన కారుకు గుర్తుతెలియని వ్యక్తి నిప్పంటించిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో కారు ముందు భాగం దగ్ధమై సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లింది. మోపాల్ ఎస్ఐ జెడ్. సుస్మిత తెలిపిన వివరాల ప్రకారం..

మంచిప్ప గ్రామానికి చెందిన నంగునూరి సందీప్, తండ్రి సుధాకర్కు చెందిన ఫోర్డ్ ఫిగో కారు (నంబర్ ఏపీ 09 సీహెచ్ 4434)ను అక్టోబర్ 15న సాయంత్రం సుమారు 6 గంటలకు ఇంటి ముందు రోడ్డుపక్కన పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత అక్టోబర్ 16న తెల్లవారుజామున 12.04 గంటల సమయంలో సందీప్ స్నేహితుడు గోవురి విలాస్ కారు కాలిపోతున్న విషయాన్ని అతనికి తెలియజేశాడు. దీంతో వెంటనే బయటకు వచ్చిన సందీప్ మంటలను ఆర్పేందుకు ప్రయత్నించాడు. అప్పటికే కారు ఇంజన్ భాగం, ముందు కుడివైపు టైరు, విండ్షీల్డ్, రేడియేటర్, బానెట్ తదితర భాగాలు దగ్ధమయ్యాయి.




**సీసీటీవీలో నిప్పంటించిన దృశ్యాలు**

మొదట కారు మీద విద్యుత్ సర్వీస్ వైరు తెగిపడటం వల్ల మంటలు చెలరేగి ఉంటాయని భావించారు. అయితే ఇంటి వద్ద ఉన్న సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, గుర్తుతెలియని వ్యక్తి బైక్ వచ్చి రెండు ప్లాస్టిక్ బాటిళ్లలోని ద్రవ పదార్థాన్ని కారు ఇంజన్, ముందు కుడివైపు టైరు వద్ద పోసి నిప్పంటించినట్లు కనిపించిందని సందీప్ తెలిపాడు. అనంతరం ఆ వ్యక్తి బైక్ నిజామాబాద్ వైపు వెళ్లినట్లు ఫుటేజీలో నమోదైందని పేర్కొన్నాడు.

**కేసు నమోదు.. దర్యాప్తు ప్రారంభం**

ఈ ఘటనలో తన కారుకు సుమారు రూ.1,00,000 నష్టం వాటిల్లిందని బాధితుడు సందీప్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు మోపాల్ ఎస్ఐ జెడ్. సుస్మిత కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ఘటనకు పాల్పడిన వ్యక్తిని గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ఆరుగురు పట్టివేత.. రూ.5,010 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 16 (మనం న్యూస్): నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని కంజర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,010 నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు మోపాల్ ఎస్ఐ జెడ్. సుస్మిత తెలిపారు.

ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు కంజర్ గ్రామ శివారులోని కొత్త వాగు బ్రిడ్జి కింద పేకాట ఆడుతున్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడ దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా కంజర్ గ్రామానికి చెందిన ఆరుగురిని పట్టుకొని, వారి వద్ద ఉన్న రూ.5,010 నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ వెల్లడించారు.



**చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలి**

ప్రజలు పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ జెడ్. సుస్మిత సూచించారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పెద్ద మల్లారెడ్డిలో వ్యక్తి ఆత్మహత్య

**భార్య దూరం కావడంతో మనస్తాపం?**

భిక్కనూర్, అక్టోబర్ 16 ( మనం న్యూస్ ): భిక్కనూర్ మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య, కుమారుడు దూరంగా ఉండటంతో మనస్తాపానికి గురైనట్లు భావిస్తున్న మట్టి రాజు (30) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన మట్టి రాజు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. సుమారు 18 ఏళ్ల క్రితం దోమకొండ మండలానికి చెందిన సబితను వివాహం చేసుకున్నాడు. వీరికి విక్కీ (15) అనే కుమారుడు ఉన్నాడు.




నాలుగేళ్ల క్రితం కుటుంబ కలహాల నేపథ్యంలో సబిత తన కుమారుడితో కలిసి పుట్టింటికి వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ సమస్యను పరిష్కరించేందుకు పలుమార్లు కుల పెద్దల సమక్షంలో పంచాయతీలు నిర్వహించినప్పటికీ, భార్య తిరిగి రాకపోవడంతో రాజు తీవ్ర మనస్తాపానికి గురైనట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

ఈ క్రమంలో అక్టోబర్ 15వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఇంటి పక్కనే ఉన్న వేప చెట్టుకు ప్లాస్టిక్ తాడుతో ఉరివేసుకుని రాజు మృతి చెందాడు. సమాచారం అందుకున్న భిక్కనూర్ ఎస్ఐ ఎస్. అనిల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

# పూల మార్కెట్లో బతుకమ్మ సందడి!

**గునుగు పూల నుంచి బంతిపూల వరకు.. పల్లె పట్టణాల్లో పండుగ కళ**

**ఆదివారం సద్దుల బతుకమ్మకు సిద్ధమవుతున్న మహిళలు.. కట్టకు రూ.10 నుంచి రూ.15కు గునుగు పూల విక్రయం**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 16 (మనం న్యూస్): పూలే పేరిట.. పూలే పేనుగా.. ప్రకృతే పీఠంగా.. మహిళల ఆటపాటలే ఆహ్లాదంగా సాగే బతుకమ్మ పండుగకు తెలంగాణ పల్లెలు, పట్టణాలు ముస్తాబవుతున్నాయి. ఆడబిడ్డల ఆత్మీయతకు, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. దీంతో పూల మార్కెట్లు రంగురంగుల పుష్పాలతో కళకళలాడుతున్నాయి.

## పూలతో పేర్చే ప్రకృతి పండుగ

బతుకమ్మ అంటేనే పూల పండుగ. తంగేడు, గునుగు, బంతి, చామంతి, మల్లె, కనకాంబరం తదితర పూలతో బతుకమ్మను అందంగా పేర్చి, పసుపు గౌరమ్మను ప్రతిష్ఠించి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. అనంతరం అందరూ ఒకచోట చేరి బతుకమ్మ చుట్టూ వలయంగా తిరుగుతూ ఆటపాటలతో సందడి చేస్తారు. చివరగా చెరువులు, నీటి వనరుల వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేసి పండుగను ఆనందంగా ముగిస్తారు. ప్రకృతిలో లభించే పూలతో దేవతను అలంకరించి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత.



## మార్కెట్లలో గునుగు పూలకు గిరాకీ

సద్దుల బతుకమ్మ నేపథ్యంలో నిజామాబాద్ రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో పూల విక్రయాలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా బతుకమ్మ పేర్చేందుకు ఉపయోగించే గునుగు పూలకు మహిళల నుంచి డిమాండ్ పెరుగుతోంది. వ్యాపారులు గునుగు పూలను కట్టలుగా కట్టి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో కట్టు రూ.10 నుంచి రూ.15 వరకు అమ్ముతున్నారు. బంతిపూల ధర కిలోకు సుమారు రూ.100గా ఉంది. వీటితోపాటు బతుకమ్మను అలంకరించేందుకు అవసరమైన వివిధ రకాల పూలను కూడా వ్యాపారులు అందుబాటులో ఉంచుతున్నారు.

## ఈసారి సమృద్ధిగా గునుగు పూలు!

గత ఏడాది గునుగు పూలు ఆశించిన స్థాయిలో లభించకపోవడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని స్థానికులు గుర్తుచేస్తున్నారు. అయితే ఈ



ఏడాది గునుగు మొక్కలు విస్తారంగా పెరిగినట్లు కనిపిస్తుండటంతో పూల లభ్యత మెరుగ్గా ఉందని చెబుతున్నారు. దీంతో పూల సేకరణ, విక్రయాలు జోరందుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ మార్కెట్ల వరకు బతుకమ్మ పూల కొనుగోళ్లతో పండుగ వాతావరణం నెలకొంది.

## ఆడబిడ్డల ఆటపాటలతో పల్లెలకు కొత్త కళ

సద్దుల బతుకమ్మ పండుగ అనగానే మహిళల సందడి, రంగురంగుల చీరలు, గుండ్రంగా పేర్చిన పూల బతుకమ్మలు, జానపద గీతాలు గుర్తుకొస్తాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇరుగుపొరుగు మహిళలు కలిసి



పండుగలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణ. పూల సువాసనతో పాటు ఆత్మీయతను పంచే ఈ వేడుక తరతరాలుగా తెలంగాణ సంస్కృతిని సజీవంగా ఉంచుతోంది.

పూల కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడుతుండగా, మరోవైపు మహిళలు తమ ఇళ్లలో బతుకమ్మలను పేర్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలతో పల్లె పట్టణాలలో పండుగ సందడి వెల్లివిరియనుంది. పూలతో ప్రకృతిని పూజిస్తూ, ఆటపాటలతో ఆత్మీయతను పంచుకునే ఈ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆనందానికి అద్దం పడుతోంది.

పూలలో ప్రకృతి అందం.. బతుకమ్మలో తెలంగాణ ఆత్మగౌరవం.. ఆడబిడ్డల ఆటపాటల్లో మన సంస్కృతికి జీవం!

---

# గుత్పలో దళితుల ధర్నా..

**ప్రభుత్వ మాకు ఇచ్చిన భూమిని కాపాడాలని డిమాండ్!**

**8 ఎకరాల భూమి కబ్జాకు గురైందని ఆరోపణ..**

**విద్యుత్ డబ్బాలు తిరిగి ఇవ్వాలని ఆందోళన**

ఆర్మూర్, అక్టోబర్ 6(మనం న్యూస్): ఆర్మూర్, నియోజకవర్గం లోని గుత్ప గ్రామంలోని ఎస్సీలకు ప్రభుత్వం కేటాయించిన భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసి సాగు చేసుకుంటున్నారని ఆరోపిస్తూ దళితులు గుత్ప గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. సర్వే నంబర్లు 756, 757లో సుమారు 25 ఎకరాల భూమి తమకు కేటాయించగా, ఆ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారని బాధితులు పేర్కొన్నారు.తమ భూమి కబ్జాకు గురైందని ఆరోపించిన దళితులు ఇటీవల భూమిని సర్వే చేయించగా, అక్కడ నీటి బోర్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో బోర్లకు అమర్చిన విద్యుత్ డబ్బాలను తీసుకొచ్చి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెట్టినట్లు తెలిపారు. అయితే తమకు తెలియకుండానే ఆ డబ్బాలను ఎస్త్ర పోలీస్స్టేషన్కు తీసుకెళ్లారని ఆరోపిస్తూ గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన చేపట్టారు.

## కోర్టులో కేసు ఉండగా పోలీసుల జోక్యం ఎందుకు?

భూమి వివాదంపై ఇప్పటికే కోర్టులో కేసు నడుస్తున్నప్పుడు పోలీసులు ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని దళితులు ప్రశ్నించారు. సర్వే ప్రకారం తమకు కేటాయించిన భూమిలోని విద్యుత్ డబ్బాలను తమకు తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు.ఈ క్రమంలో ఉపసర్పంచ్ జోక్యం చేసుకోవడంతోఅక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొన్నట్లు తెలిసింది. తమ భూమి సమస్య పరిష్కారమయ్యే వరకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దే ధర్నా కొనసాగిస్తామని బాధిత దళితులు స్పష్టం చేశారు.ప్రభుత్వం తమకు కేటాయించిన భూమిని కాపాడి, సమస్యను పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



---

# డిచ్పల్లి ఏడో బెటాలియన్లో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన దుర్గామాత.. భక్తులకు అన్నప్రసాద వితరణ**



నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 16 (మనం న్యూస్): డిచ్పల్లి సమీపంలోని ఏడో బెటాలియన్ టీజీఎస్పీ ( టీజీఎస్ పి) పరిధిలో ఉన్న శ్రీ దుర్గామాత ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తున్నారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని





అందజేశారు. భక్తులకు సేవ చేయడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం సేవాభావానికి ప్రతీకగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో ఏడో బెటాలియన్ అధికారులు, సిబ్బంది, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని, సమాజంలో శాంతి, ఐకమత్యం, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు.



# బతుకమ్మ వేడుకలకు ముస్తాబవుతున్న బాబాపూర్ గ్రామం

భీమ్గల్ ,అక్టోబర్ 16 ( మనం న్యూస్):భీమ్గల్ మండలం బాబాపూర్లో చెరువు వద్ద లైటింగ్, మొరం ఏర్పాటు.. సర్పంచ్ ఎంఏ.సమీ్వ గ్రామస్తుల ప్రశంసలు. కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజలందరికీ పండుగ వేడుకల్లో సౌకర్యాలు కల్పించే దిశగా బాబాపూర్ గ్రామ సర్పంచ్ ఎంఏ.సమీర్ చేపట్టిన ఏర్పాట్లపై గ్రామస్తులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.భీంగల్ మండలం బాబాపూర్ గ్రామంలో బతుకమ్మ సంబరాలను పురస్కరించుకుని చెరువు వద్ద ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, ట్రాక్టర్తో మొరం పోయించి పరిసరాలను సిద్ధం చేశారు.బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో వేడుకలు జరుపుకునేందుకు వీలుగా ఈ ఏర్పాట్లు చేపట్టారు. పండుగ వేళ గ్రామ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, అందరూ కలిసి వేడుకల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కులమతాలకతీతంగా గ్రామ అభివృద్ధి, ప్రజల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని పేర్కొంటున్నారు.ఈ ఏర్పాట్లలో ఉప సర్పంచ్ గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి సంతోష్, కారోబార్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్గా తాటిపల్లి ధర్మయ్య నియామకం



**ధర్మకర్తలుగా నలుగురికి అవకాశం.. షబ్బీర్ అలీ ఆదేశాలతో నియామకాలు**

భిక్కనూర్, అక్టోబర్ 17 ( మనం న్యూస్ ): భిక్కనూరు మండలం తిప్పాపూర్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్గా తాటిపల్లి ధర్మయ్యను నియమించారు. షబ్బీర్ అలీ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు తెలిసింది.

ఆలయ ధర్మకర్తలుగా ఏనుగు బాపురెడ్డి, శామర్తి సత్యనారాయణ, వంగ మల్లేశ్వరి, దుర్గ గౌడ్లను నియమించారు. ఆలయ నిర్వహణ ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో నూతన కమిటీ కీలక పాత్ర పోషించనుంది. ఈ నియామక కార్యక్రమం పీఏసీఎస్ చైర్మన్ భీమ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. నూతనంగా నియమితులైన చైర్మన్, ధర్మకర్తలు ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

# భీమ్గల్ లో ఉరివేసుకుని యువకుడు మృతి



భీమ్గల్ ,అక్టోబర్ 16 ( మనం న్యూస్): కుటుంబంలో కలహాల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భీంగల్ మండల కేంద్రంలోని బాపూజీనగర్ కాలనీలో చోటుచేసుకొంది. ఎస్ ఐ తిరుపతి తెలిపిన వివరాల మేరకు సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బాపూజీనగర్ కాలనిలో నివాసం ఉంటున్న దావూద్ స్వస్థలం కోరుట్ల మండలానికి చెందినవారు కాగా, గత 15 సంవత్సరాల నుంచి భీంగల్ లోనే నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. కాగా కోరుట్లలో తన తల్లి, చెల్లెలు కలిసి ఉంటుండగా వారు ఉన్న ఇల్లు అమ్మే విషయమై వారి మధ్య మనస్పర్థలు, వివాదాలు తలెత్తాయి. ఈ విషయమై దావుద్ కుమారుడు షేక్ రహీం రెండు రోజుల క్రితం కోరుట్ల వెళ్లి నిన్న సాయంత్రం 6:30 గంటలకు తిరిగి భీంగల్ కు వచ్చాడు. రాత్రి నిద్రపోగా, శుక్రవారం ఉదయం సుమారు 4:00 గంటలకు అతని భార్య పని నిమిత్తం బయటకు వెళ్లగా, ఉదయం 7:30 గంటల ప్రాంతంలో ఇంట్లో వారి పిల్లలు బయట ఉండగా, గది తలుపులు లోపల నుండి గడి వేసి ఉండటంతో పిల్లలు ఎంత పిలిచిన తలుపు తీయలేదు. వెంటనే అతని కూతురు కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా షేక్ రహీం రేకుల పైకప్పుకు ఉన్న ఇనుప రాడ్ కు చున్నితో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. మృతుని భార్య షేక్ షహీనా ఫిర్యాదు ప్రకారం, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# భావి భారత పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

**చీమన్పల్లిలో గురువులకు ఘన సన్మానం.. ఎడ్లబండిపై ఊరేగించి గురుభక్తిని చాటుకున్న పూర్వ విద్యార్థులు**



నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 16 (మనం న్యూస్): భావి భారత పౌరులను తీర్చిదిద్ది, విద్యాబుద్ధులతో పాటు నైతిక విలువలను నేర్పించి, మంచి సమాజ నిర్మాణానికి బాటలు వేసేది ఉపాధ్యాయులేనని చీమన్పల్లి గ్రామ సర్పంచ్ కల్లెం నరసయ్య అన్నారు. సిరికొండ మండలంలోని చీమన్పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1982 నుంచి 1985 వరకు పనిచేసిన ఉపాధ్యాయులను శుక్రవారం పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ నరసయ్య మాట్లాడుతూ.. ఒకప్పుడు కనీస వసతులు సైతం లేని పరిస్థితుల్లోనూ గ్రామంలోనే ఉండి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని కొనియాడారు. విద్యార్థుల జీవితాల్లో గురువుల పాత్ర ఎంతో కీలకమని, వారు నేర్పిన విలువలే జీవితాంతం మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

**ఎడ్లబండిపై గురువుల ఊరేగింపు**

తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల పట్ల కృతజ్ఞతను చాటుకునేందుకు పూర్వ విద్యార్థులు వినూత్నంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులను ఎడ్లబండిపై ఊరేగిస్తూ తమ గురుభక్తిని, గౌరవాన్ని చాటుకున్నారు. అనంతరం గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించి, వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల రోజుల్లోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు.

**గురుశిష్యుల అనుబంధానికి ప్రతీక**

ఎన్నో సంవత్సరాల తర్వాత ఒకేచోట కలుసుకున్న గురువులు, శిష్యులు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమ జీవితాలకు పునాది వేసిన ఉపాధ్యాయులను సత్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. గురువులను ఎడ్లబండిపై ఊరేగించడం, ఘనంగా సన్మానించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గురువుల పట్ల గౌరవం కాలంతో పాటు తగ్గదని, విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల స్థానం ఎప్పటికీ ప్రత్యేకమని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగు రాజేందర్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మారుపాక రజిత, వార్డు సభ్యులు గణేష్ మాలావత్, లావణ్య రాజు, చార్వాక ప్రసాద్, పూర్వ విద్యార్థులు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం. బాలయ్య, ట్రాన్స్కో ఉద్యోగి, భీమ్గల్ ప్రాంత ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. పల్సిరాం, ఉపాధ్యాయులు ఎం. జవహర్లాల్, మూల లింగారెడ్డి, నాయకులు కె. జలంధర్, ఎం. నందిలాల్, గడ్డం రాజిరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# భీమ్గల్ కోర్టు ఆవరణలో బెంచీల వితరణ

భీమ్గల్ ,అక్టోబర్ 16 ( మనం న్యూస్): భీమ్గల్ కోర్టు సవరణలో అక్కడికి వచ్చిన ప్రజల సౌకర్యార్థం సిమెంట్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన న్యాయవాది బేతు జగదీష్.

భీమ్గల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన కోర్టు భవన సముదాయంలో అక్కడి కోర్టు పని నిమిత్తం వచ్చిన వారికి కూర్చోవడానికి ఇబ్బందిగా ఉండడం గమనించి న్యాయవాది జగదీష్ తన మాతృ మూర్తులు బేతు రాజారాం, బేతు భూమగంగు జ్ఞాపకార్థం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడం ప్రశంసనీయం.



# కోట దుర్గమ్మ ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- సరస్వతి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు.
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు.
- బ్లూమింగ్ మైండ్స్ నవోదయ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో అన్నదానం.
- 600 మంది భవాని దీక్షా స్వాములకు అన్నప్రసాద వితరణ.



కామారెడ్డి, అక్టోబర్ 16 (మనం బ్యూరో):: కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని కోట దుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

**600 మంది భవాని స్వాములతో ప్రత్యేక పూజలు.**

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుమారు 600 మంది భవాని మాత దీక్షా స్వాములు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు పొందుతూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు, దీక్షా స్వాముల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి అన్నప్రసాదాన్ని అందజేశారు.

**బ్లూమింగ్ మైండ్స్ నవోదయ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో అన్నదానం.**

బ్లూమింగ్ మైండ్స్ నవోదయ స్కూల్ యాజమాన్యం తరఫున అఖిల్ గౌడ్, ప్రవీణ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పండుగ వేళ ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందించడం పట్ల ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమానికి సహకరిస్తూ సేవా కార్యక్రమాన్ని చేపట్టిన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.

అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన అఖిల్ గౌడ్, ప్రవీణ్ లను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి, అమ్మవారి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని, సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

**హన్మాజీపేట్ భవాని స్వాములకు ఘన స్వాగతం.**

ఈ కార్యక్రమానికి హన్మాజీపేట్ గ్రామం నుంచి విచ్చేసిన భవాని మాత దీక్షా స్వాములకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక స్వాగతం పలికారు. స్వాములు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

**కార్యక్రమంలో పాల్గొన్న కోట దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యులు.**

ఈ కార్యక్రమంలో కోట దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఉప్పరి లింగం, పత్తి శ్రీకాంత్, బాలకృష్ణతో పాటు హన్మాజీపేట్ గ్రామానికి చెందిన భవాని స్వాములు నాగులపల్లి గంగాధర్, మహేందర్ గౌడ్, గడిల ఉజ్వల, బోనాల శేఖర్, శ్రీధర్ గౌడ్, నాగులపల్లి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

**భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు.**

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూజా కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. భక్తి, సేవాభావం, ఆధ్యాత్మికతను చాటిచెప్పేలా కోట దుర్గమ్మ ఆలయంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

# రామావత్ దేవిసింగ్కు బీజేపీలో కీలక బాధ్యతలు.. ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకం

పార్టీ బలోపేతానికి కృషి చేసిన అనుభవానికి గుర్తింపు..

జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు ఉత్తర్వులు

సర్పంచ్గా, ఎంపీటీసీగా, సొసైటీ వైస్ చైర్మన్గా ప్రజలకు సేవలు



**పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: రామావత్ దేవిసింగ్**



కామారెడ్డి, అక్టోబర్ 16 ( మనం న్యూస్ ): భారతీయ జనతా పార్టీ కామారెడ్డి జిల్లా ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులుగా మాజీ ఎంపీటీసీ రామావత్ దేవిసింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామస్థాయి నుంచి రాజకీయాల్లో చురుకుగా వ్యవహరిస్తూ, ప్రజలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్న దేవిసింగ్కు పార్టీ జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**ప్రజాసేవలో అనుభవం.. రాజకీయాల్లో చురుకైన పాత్ర**

రామావత్ దేవిసింగ్ గతంలో సర్పంచ్గా రెండు పర్యాయాలు పనిచేసినట్లు, ఎంపీటీసీగా, సొసైటీ వైస్ చైర్మన్గా బాధ్యతలు నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయా పదవుల్లో ఉన్న సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామాభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశారు. గ్రామస్థాయిలో రాజకీయ అనుభవాన్ని సంపాదించుకున్న ఆయనకు ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని రామావత్ దేవిసింగ్ తెలిపారు. ఎస్టీ మోర్చా ద్వారా గిరిజన ప్రజల సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



**పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు**

తనకు జిల్లా ఉపాధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులుకు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడి ఎల్లారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు.

**పార్టీ శ్రేణుల్లో హర్షం**

రామావత్ దేవిసింగ్ నియామకం పట్ల బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు అప్పగించిన కొత్త బాధ్యతలతో ఎస్టీ మోర్చా మరింత బలోపేతం అవుతుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేశాయి. గిరిజన ప్రాంతాల్లో పార్టీ కార్యక్రమాల విస్తరణకు, ప్రజా సమస్యలపై చొరవ చూపేందుకు ఆయన అనుభవం ఉపయోగపడుతుందని అభిప్రాయపడుతున్నారు.



# శ్రీ దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్న ఈరవత్రి రాజశేఖర్

**నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు.**

ఆర్మూర్, అక్టోబర్ 16 (మనం న్యూస్): ఆర్మూర్ నియోజకవర్గం ఆలూర్ మండల కేంద్రంలోని రామ్నగర్ కాలనీలో రామ్నగర్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శ్రీ దుర్గాదేవి అమ్మవారిని ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్, శుక్రవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని కోరారు.అనంతరం అమ్మవారి అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, రామ్ ప్రసాద్, నూకల శేఖర్, టైలర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి

సదాశివనగర్, అక్టోబర్ 16(మనం న్యూస్): సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను ప్రభుత్వ నిబంధనల ప్రకారం,పారదర్శకంగా నిర్వహించి నిజమైన అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామ ప్రజలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.అర్హులైన ఇల్లు లేని కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని,దరఖాస్తుదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని,రాజకీయ,వ్యక్తిగత ప్రభావాలకు తావు లేకుండా ఎంపిక చేయాలని కోరారు.అర్హులైన వారికి అన్యాయం జరగకుండా లబ్ధిదారుల జాబితాను పునఃపరిశీలించి ఫిర్యాదులపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పసుపు రాజు,వడ్ల శ్రీనివాస్,అమృత రాజేందర్,చిన్నబీర రవికుమార్,వంగరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# లో వోల్టేజీతో చిన్న ఎక్లారా గ్రామస్థుల ఇబ్బందులు



మద్నూర్, అక్టోబర్ 16 (మనం న్యూస్): మండల పరిధిలోని చిన్న ఎక్లారా గ్రామాన్ని లో వోల్టేజీ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, తక్కువ వోల్టేజీ కారణంగా బోరు మోటార్లు సరిగా పనిచేయడం లేదని గ్రామ సర్పంచ్ మాధవరావు తెలిపారు. దీంతో గ్రామంలో తాగునీరు, సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పశువులకు తాగునీరు అందించడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు నిలిచిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించి, గ్రామానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని కోరారు. కాగా, ఈ విషయంపై ఏఈని వివరణ కోరగా, సబ్‌స్టేషన్లో ఫీడర్ సమస్య ఉందని తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

# పండుగల వేళ పట్టణంలో సెంట్రల్ లైటింగ్ మరమ్మతులు

**ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాం: సర్పంచ్ రేఖ సుదర్శన్**

భిక్కనూర్, అక్టోబర్ 16 ( మనం న్యూస్ ): బతుకమ్మ, దసరా పండుగలను దృష్టిలో ఉంచుకుని భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని సెంట్రల్ లైటింగ్కు గ్రామ పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. పండుగల సమయంలో పట్టణ ప్రజలకు పండుగలకు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లైటింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఈ పనులు చేపట్టారు.



బతుకమ్మ, దసరా పండుగలు తెలంగాణ ప్రజలకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన పెద్ద పండుగలని ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున సెంట్రల్ లైటింగ్ మరమ్మతులు చేపడుతున్నామని సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ తెలిపారు.

పండుగల సమయంలో పట్టణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. పండుగలను ప్రజలందరూ సంతోషంగా, సురక్షిత వాతావరణంలో జరుపుకోవాలనే ఉద్దేశంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈ మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు.



# పెద్దమల్లారెడ్డిలో కన్నుల పండువగా బతుకమ్మ సంబరాలు

**ఒకే రకమైన చీరకట్టులో మహిళల ఆటపాటలు.. గ్రామంలో పండుగ శోభ**

భిక్కనూరు, అక్టోబర్ 16 ( మనం న్యూస్ ): భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో బతుకమ్మ పండుగ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. గ్రామానికి చెందిన మహిళా సభ్యులు ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తూ ఒకే రకమైన చీరకట్టులో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆడుతూ పాటలు పాడుతూ సందడి చేశారు.

ఒకే రకమైన వస్త్రధారణలో మహిళలంతా కలిసి బతుకమ్మ ఆడటంతో పండుగ ప్రాంగణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల ఆటపాటలు, ఉత్సాహం, ఆనందోత్సాహాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్క ృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఐకమత్యంతో నిర్వహించుకోవడం విశేషంగా నిలిచింది.

ఈ వేడుకలు గ్రామ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు మహిళల మధ్య ఐక్యత, సోదరభావాన్ని చాటిచెప్పాయి. సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా మహిళలు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

# సరస్వతీదేవి అలంకారంలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

**- ఆరో రోజు సరస్వతీదేవి అవతారంలో అమ్మవారి అలంకరణ.**

**- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్.**

కామారెడ్డి, అక్టోబరు 16(మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలోని వైద్యనాథ్ కాలనీలో శ్రీ సింహాసనేశ్వరి దుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం అమ్మవారిని శ్రీ సరస్వతీదేవి అలంకారంలో ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వేదమంత్రాలు, భక్తుల నామస్మరణల మధ్య అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిప్రపత్తులతో పూజలు నిర్వహించారు. సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



**భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన కాలనీవాసులు**

ఈ సందర్భంగా ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాలనీవాసులందరూ ఐక్యంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు పరస్పర ఐక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో శ్రీ సింహాసనేశ్వరి దుర్గామాత ఉత్సవ సమితి సభ్యులు సుధీర్రెడ్డి, కృష్ణారెడ్డి, విష్ణు, లక్ష్మణ్, కాలనీవాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా కొనసాగుతున్న బతుకమ్మ వేడుకలు



సదాశివనగర్ , అక్టోబర్ 16(మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా జరుగుతుంది.తొలిరోజైన ఎంగిలిపూల బతుకమ్మ పండుగ మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో,ఉత్సాహంగా పాల్గొంటున్నారు.ప్రకృతిలో లభించే రంగురంగుల,తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు,ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మను గ్రామాలలో మహిళలు సంప్రదాయబద్ధంగా జరుపుతున్నారు.బతుకమ్మల చుట్టూ చేరి పురాణ, ఇతిహాసాల పాటలు పాడుతూ,చప్పట్లు కొడుతూ ఆనందోత్సాహాలతో వేడుక జరుపుకోవడం జరుగుతుంది.ప్రతి ఏటా ఆశ్వయుజ మాసంలో తొమ్మిది రోజులపాటు నిర్వహించే బతుకమ్మ పండుగలో బతుకమ్మకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.అడవి పూలను పూజిస్తూ ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే ఈ పండుగ తెలంగాణ మహిళల జీవనశైలి,సంస్కృతి, సంప్రదయాలను ప్రతిబింబిస్తుంది.కుటుంబ సభ్యులు,ఇరుగుపొరుగు మహిళలు ఒకచోట చేరి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొవడం జరుగుతుంది.మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను పేర్చి ఆనందంగా ఆడిపాడడంతో మండలంలోని పలు గ్రామాల్లో సందడి కనిపిస్తుంది.తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పలువురు పేర్కొంటున్నారు.